సాక్షి సంగారెడ్డి
శనివారం, 9, డిసెంబర్, 2023

న్యూస్‌రీల్

గ్యాస్‌కు కేవైసీ తప్పనిసరి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పొందాలంటే లబ్ధిదారులు కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని నారాయణఖేడ్ భారత్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు మహారెడ్డి మహిపాల్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, గ్యాస్‌కనెక్షన్‌కు సంబంధించిన బుక్‌తో ఖేడ్‌లోని భారత్‌గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వచ్చి వేలిముద్ర వేసి కేవైసీ చేసుకోవాలని సూచించారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే


తిరుమలలో ఎమ్మెల్యే, నాయకులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి మూడోసారి శాసనసభకు ఎన్నికైన గూడెం మహిపాల్‌రెడ్డి శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు చెప్పారు.

ఘన స్వాగతం


సంజీవరెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

నారాయణఖేడ్: ఎమ్మెల్యేగా గెలిచిన పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం మొదటిసారి నారాయణఖేడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేదపండితులు వేద ఆశీర్వచనాలు ఇచ్చిన అనంతరం సన్మానించారు.

మెరుగైన విద్యనందించాలి

డీఈఓ వెంకటేశ్వర్లు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. జిన్నారం మండలం మాదారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న లెసన్‌ప్లాన్‌ను డీఈఓ స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంజయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో టీఎన్జీఓ సంబురాలు


కలెక్టరేట్‌లో స్వీట్స్ తినిపించుకుంటున్న ఉద్యోగులు

సంగారెడ్డి: నూతన ప్రభుత్వానికి టీఎన్జీఓ పూర్తి సహకారం అందిస్తుందని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తామని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఎండీ జావీద్ అలీ అన్నారు. కేంద్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి మారం జగదీశ్వర్ పిలుపుమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు మిఠాయిలు పంచుకుని, బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా జావీద్ అలీ మాట్లాడుతూ జీఓ 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగులను తిరిగి వారి సొంత జిల్లాలకు తీసుకొచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, కేంద్ర సంఘం సభ్యులు నిర్మల, రాజ్‌కుమార్, నేతి శ్రీనివాస్, వైద్యనాథ్, మహేష్, నవాజ్, భాస్కర్, సుదామని, శ్రీకాంత్ గౌడ్, సాయి, యాదవరెడ్డి, వరకాల విజయకుమార్ పాల్గొన్నారు.

మంచు దుప్పటి


జహీరాబాద్‌లో..



నారాయణఖేడ్‌లో కమ్ముకున్న పొగమంచు

జిల్లాను దట్టమైన పొగ మంచు కమ్మేసింది. శుక్రవారం ఉదయం 9గంటలైనా పల్లెలపై పర్చుకున్న మంచు దుప్పటి వీడలేదు. జహీరాబాద్, నారాయణఖేడ్, ఝరాసంగం మండలాల పరిధిలో దారులు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకుని వాహనాలు నడపాల్సి వచ్చింది. దీనికితోడు విపరీతమైన చలికి జనం గజగజ వణుకుతూ ఉదయం 10గంటలైనా ఇళ్ల నుంచి బయటకు రాలేదు.

– జహీరాబాద్/ నారాయణఖేడ్ / ఝరాసంగం(జహీరాబాద్)

కమల విలాపం !

- జిల్లాలో బీజేపీ దారుణ ఓటమి
- ఆ పార్టీ అభ్యర్థులెవరికీ దక్కని డిపాజిట్లు
- ముగ్గురికైతే జెడ్పీటీసీకి వచ్చినన్ని ఓట్లు కూడా రాలే..




సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ పూర్తిగా డీలా పడింది. జిల్లాలో ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులెవరికీ కనీసం డిపాజిట్ కూడా దక్కలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే ఇది అసలు జాతీయ పార్టీయేనా అనే అనుమానం కలుగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ పార్టీ అభ్యర్థులకు కనీసం ఓ జెడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్‌కు వచ్చినన్ని ఓట్లు కూడా రాకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పార్టీకి ఈ దారుణమైన ఫలితాలు రావడానికి ప్రధాన కారణం సరైన అభ్యర్థులను ఎంపిక చేయకపోవడమే కారణమని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. జిల్లాలో ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా మొదటి నుంచి చేతులెత్తేశారు. మొక్కుబడిగా ప్రచారం నిర్వహించారు. కనీసం కమలం క్యాడర్‌తోనూ సమన్వయం చేసుకోలేకపోయారు. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి జిల్లాలో ఈ దారుణమైన ఫలితాలు వచ్చాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సంగప్ప.. సింగిల్ డిజిట్

నారాయణఖేడ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన జనవాడే సంగప్పకు వచ్చిన ఓట్లు కేవలం 7,823 మాత్రమే. ఇక్కడ మొత్తం 1.92 లక్షల ఓట్లు పోలవగా ఆయనకు వచ్చింది కేవలం నాలుగు శాతం మాత్రమే. ఓ జెడ్పీటీసీ అభ్యర్థికి వచ్చినన్ని ఓట్లు కూడా సంగప్ప సాధించలేకపోయారు. అభ్యర్థిత్వం ఖరారు కాకముందే సంబరాలు చేసుకున్న సంగప్ప.. అభ్యర్థిత్వం ప్రకటించాక మొక్కుబడి ప్రచారంతో సరిపెట్టారు. దీంతో ఈ ఎన్నికల్లో ఆయన కనీస ప్రభావం చూపలేకపోయారు.

> **అభ్యర్థుల ఎంపికే తప్పిదమా?**
>
> బీజేపీ అధినాయకత్వం జిల్లాలో అభ్యర్థుల ఎంపిక విషయంలో తప్పిదం చేసిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రజల్లో పట్టున్న నేతలను బరిలో దించితే కొంతలో కొంత మెరుగైన ఫలితాలు వచ్చేవనే వాదన వినిపిస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనైనా బలమైన అభ్యర్థులను బరిలోకి దించాల్సిన అవసరం ఎంతైన ఉందనే అభిప్రాయం కమలం క్యాడర్‌లో, రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

రాంచందర్‌కు కేవలం ఆరు శాతమే..

జహీరాబాద్ నుంచి కమలం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాంచందర్ రాజనర్సింహకు వచ్చిన ఓట్ల సంఖ్య కూడా ఇదేవిధంగా ఉంది. మొత్తం 2.07 లక్షల ఓట్లు పోలవగా, రాంచందర్‌కు 13,645 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే పోలైన ఓట్లలో కేవలం 6 శాతం మాత్రమే. గత ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన జంగం గోపికి 20 వేలకు మించి ఓట్లు రాగా, ఈసారి అంతకంటే తగ్గడం గమనార్హం.

చేతులెత్తేసిన బాబుమోహన్..

మాజీ మంత్రి బాబుమోహన్ ఆందోల్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఇక్కడ మొత్తం 2.11 లక్షల ఓట్లు పోలవగా, ఆయనకు వచ్చిన ఓట్లు కేవలం 5,524 (నాలుగు శాతం) మాత్రమే. స్వయంగా బాబుమోహన్ కుమారుడే ఎన్నికల వేళ బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరడం సంచలనంగా మారింది. తాను పోటీ చేయనని బాబు మోహన్ ప్రకటించినప్పటికీ పార్టీ అధినాయకత్వం ఆయనకే టికెట్ ఇచ్చిన విషయం విధితమే.

సంగారెడ్డి కాస్త మెరుగు..

సంగారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థిగా పులిమామిడి రాజు పోటీ చేశారు. ఇక్కడ బీజేపీకి కాస్త మెరుగైన ఓట్లు వచ్చినప్పటికీ ఆయనకు కూడా డిపాజిట్లు రాలేదు. మొత్తం 1.84 లక్షల ఓట్లు రాగా, రాజుకు 20,921 ఓట్లు వచ్చాయి. సంగారెడ్డి నియోజకవర్గంలో కమలం పార్టీ క్యాడర్‌లో కొంత మంది పులిమామిడి రాజుకు పూర్తి స్థాయిలో సహకరించలేదు. గతంలో బీజేపీ సంగారెడ్డి ఎమ్మెల్యే స్థానాన్ని గెలుచుకున్న చరిత్ర కూడా ఉంది. కానీ ఈసారి మాత్రం చతికిల పడింది.

పటాన్‌చెరులోనూ అంతంతే..

పటాన్‌చెరులో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన నందీశ్వర్‌గౌడ్ పోటీ చేశారు. ఇక్కడ ఆయన నాలుగో స్థానానికి పడిపోవడం గమనార్హం. మొత్తం 2.76 ఓట్లు పోలవగా, నందీశ్వర్‌కు కేవలం ఏడు శాతం మాత్రమే వచ్చాయి. మినీ ఇండియాగా పేరున్న పటాన్‌చెరులో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఓటర్లు కూడా ఉంటారు. మోదీ హవా కూడా ఇక్కడ పనిచేయకపోవడం గమనార్హం.

చెరకు బకాయిలు చెల్లించాలి


అధికారులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులకు రావాల్సిన బకాయిలను ట్రైడెంట్ యాజమాన్యం వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు.

రోడ్ల పరిశీలన

జహీరాబాద్ పట్టణంలోని పలు కాలనీలను ఎ.చంద్రశేఖర్ సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, డీఈఈ దీప్‌చంద్‌లతో కలిసి రోడ్ల పరిస్థితిని సమీక్షించారు. అధ్వానంగా ఉన్న రోడ్లను వెంటనే నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.జి.రాములు, ఖాజా, రాజశేఖర్, జాఫర్, పి.నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్ రైల్వే అవసరాలను తీర్చండి

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో రైల్వే అవసరాలను తీర్చాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ రైల్వే అధికారులను కోరారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్వే భవన్‌లో నిర్వహించిన 169వ డీఆర్‌యూసీసీ సభ్యుల సమావేశంలో షేక్ ఫరీద్ మాట్లాడారు. బీదర్ నుంచి లింగంపల్లి వరకు జహీరాబాద్ మీదుగా మెమో ఎలక్ట్రికల్ రైలును నడిపించాలన్నారు. మండల కేంద్రమైన కోహీర్‌లోని రైల్వే స్టేషన్ వద్ద ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని విన్నవించారు. జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను అమృత్ స్టేషన్‌గా మంజూరు చేసినందున పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సూచన మేరకు పలు అవసరాలను ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రైల్వే డీఆర్ఎం బి.కె.భరతేష్‌కుమార్ జైన్, సీనియర్ డీసీఎం సెక్రటరీ బస్వరాజ్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్

మాదక ద్రవ్యాలను అరికట్టండి


జిల్లా రెవెన్యూ అధికారి నగేష్


అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ నగేష్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి నగేష్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పోలీస్, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, విద్య, తదితర శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమ రవాణా, వినియోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రైతులు ఎవరైనా గంజాయి పంటను సాగు చేస్తే రైతుబంధును నిలిపివేయనున్నట్లు చెప్పారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని పోలీస్, అబ్కారీ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.గాయత్రీ దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వాణి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.

అప్పులెట్లా తీర్చాలె!

- వర్షాలకు పత్తి రైతు చిత్తు
- భారీగా తగ్గిన దిగుబడి
- పడిపోయిన ధర


ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి



మునిపల్లి(అందోల్): పత్తి రైతులను ప్రస్తుత వర్షాలు నిండా ముంచాయి. పంటచేతికొచ్చిన సమయంలో వర్షాలు కురవడంతో పంట దిగుబడి సగానికి పైగా తగ్గిపోయింది. అంతేకాకుండా పత్తిని తెంపడానికి కూలీలు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి ఎక్కువ డబ్బు ఇచ్చి వలస కూలీలను తీసుకొస్తున్నారు. కిలోకు రూ.10 చెల్లించి పత్తిని తెంపిస్తున్నారు. అలాగే వారు ఉండటానికి గుడారాల ఏర్పాటు, రవాణా తదితర ఖర్చులు రైతులు అదనంగా భరించాల్సి వస్తుంది. దీంతో కిలో పత్తి తెంపడానికి మొత్తం రూ.15 ఖర్చు అవుతుంది. వర్షాల కారణంగా ఎకరాకు 2 నుంచి 4 క్వింటాళ్ల పత్తి దిగుబడి మాత్రమే వస్తుంది. దిగుబడి తగ్గడంతో కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పత్తి తెంపే సమయంలో క్వింటాల్‌కు రూ.7,020 సీసీఐ ధరను ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది 8వేలకు పైగా ధర పలికింది. ఈసారి వర్షాల కారణంగా పత్తి తడవడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువ ధర రూ.6,900 నుంచి రూ.6,700కు అమ్ముడుపోతుంది. మరింత ధర తగ్గుతుందేమోనని కొందరు రైతులు హడావిడిగా పత్తిని అమ్మేస్తున్నారు. మరికొందరు ధర పెరుగుతుందేమోననే ఆశతో ఇంట్లో నిలువ చేసుకుంటున్నారు. ఇటు పంట అమ్మలేక.. అటు పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యాపారులు సైతం మార్కెట్లో ధర లేదని తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

ఏడేళ్లుగా నిరాశే



వర్షాలతో పత్తి పంట దిగుబడి 70 శాతం తగ్గి పోయింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు 20 వేల రూపాయల పైగా ఖర్చు అయింది.

చిట్కుల సంగయ్య (పెద్దలోడి)

గిట్టుబాటు ధర కల్పించాలి



పత్తి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. క్వింటాల్ పత్తికి రూ.12,500 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించి రైతులను ఆదుకోవాలి.

బోయిని శ్రీనివాస్ (తాటిపల్లి)

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న గురుబసవేశ్వర విరక్తి మఠం పీఠాధిపతి శివానంద మహాస్వామి

సదాశివపేట(సంగారెడ్డి): ఉరుకులు పరుగుల జీవనంలో ఒత్తిడికి గురవుతున్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని కర్ణాటక రాష్ట్రం గురుబసవేశ్వర విరక్తి మఠం పీఠాధిపతి శ్రీ శివానంద మహాస్వామి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పెద్దమఠంలో శ్రీమాన్ నిరంజన ప్రణవ స్వరూపులు లింగైక్య జగద్గురు విరూపాక్షనంద మహాస్వాముల వారి 51వ వార్షిక పుణ్యస్మరణోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాంతలింగ మహాస్వాములవారి దుదుని అలంపల్లి మఠం సమక్షంలో స్వస్తిశ్రీ శోభకృత్ నామ కార్తీక ఏకాదశి కార్యక్రమాలు నిర్వహించారు. మహేశ్వరులకు శివదీక్ష పూజ్య గురువులు గద్దిగెకు మహాన్యాయ పూర్వక రుద్రాభిషేకం, సహస్రబిల్వార్చన, మంత్ర పుష్పం, నైవేద్యం, మహామంగళహారతి, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీసోమేశ్వర శివాచార్య మహాస్వామి, బిచ్కుంద మఠం శ్రీవరసిద్ధమహాస్వాములు, షడాక్షరీ మహాస్వామి, మున్సిపల్ చైర్మన్ పిల్లోడి జయమ్మ, పిల్లోడి విశ్వనాథం, చీల మల్లన్న, బోడగామ శ్రీశైలం, అప్రమాది రాచన్న, అన్నిశెట్టి జయప్రకాష్, జంగమయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా


ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ప్రజలు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం సదాశివపేటలో ఎమ్మెల్యేను గొల్లగూడెం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, జీవితాంతం వారికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మునిగే నవీన్ కుమార్, గ్రామ ఎరుకుల సంఘం అధ్యక్షుడు మండలాపురం గోపాల్, వార్డు మెంబర్ నీరడి నవేంద్రయ్య, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ మునిగే నర్సింలు, అశోక్, నరేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ఆర్అండ్ఆర్ కాలనీలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు గణేశ్, నివాస్, స్వామి, కార్తీక్, అక్షిత ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు నారాయణపేటలో జరిగే 67వ రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం కరీమొద్దీన్ అభినందించారు.

విద్యుత్ పొదుపుపై వర్క్‌షాప్..



అవగాహన కల్పిస్తున్న రంజిత్

సిద్దిపేటజోన్: బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఏపీసెన్సీ, తెలంగాణ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీఎస్ రెడ్కో) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలో వినియోగించే ఫైవ్ స్టార్ ఎలక్ట్రానిక్ సామగ్రి, విద్యుత్ పొదుపు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రంజిత్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఫైవ్ స్టార్ ఎలక్ట్రానిక్ వస్తువులను మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాంమోహన్, హెడ్ ప్రవీణ్ కుమార్, ప్రతినిధులు రామేశ్వర్, శర్మ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

గజ్వేల్: గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి మాదాసు శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యదర్శి జాన్‌వెస్లీకి రాజీనామా పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన సతీమణి అన్నపూర్ణతోపాటు తనకు రెండు పర్యాయాలు పదవిని అప్పగించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పదవిలో ఉన్నా.. లేకున్నా నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటానని పేర్కొన్నారు. కార్యకర్తలకు, నాయకులకు నిరంతరం అందుబాటులో ఉంటూనే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పల్లెకు రాని వెలుగులు

- గ్రామాలకు దూరమైన ఆర్టీసీ బస్సులు
- దౌల్తాబాద్ మండలంలో ప్రజల అవస్థలు
- నిత్యం గజ్వేల్, హైదరాబాద్‌కు ప్రయాణం
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్(దుబ్బాక): బస్సులు పల్లెలకు దూరమయ్యాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో భారంగా వెళ్తున్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్‌పూర్, సూరంపల్లి, దొమ్మాట, గాజులపల్లి గ్రామాల ప్రజలు గజ్వేల్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు లేక ఆటోల్లో వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. బస్సుల సౌకర్యం కల్పించాలని ఏళ్ల కొద్దీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గజ్వేల్‌కు ప్రతిరోజూ గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి గ్రామాల ప్రజలు, ఉద్యోగులు వెళ్తుంటారు. అలాగే హైదరాబాద్‌కు వెళ్లే వారు సైతం ముందు గజ్వేల్‌కి వెళ్లి అక్కడి నుంచి బస్సుల్లో వెళ్తుంటారు. దీంతో సమయం సైతం వృథా అవుతుందని, ఆటోల్లో వెళ్లడంతో అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. అలాగే, ప్రైవేట్ వాహనాల్లో అధికంగా జనాలను ఎక్కించుకోవడంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్తున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు బస్సు సౌకర్యం లేక సమయానికి పాఠశాలలకు చేరుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సులు నడిపించాలి



బస్సు సౌకర్యం లేక హైదరాబాద్, గజ్వేల్‌కు వెళ్లే గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనిముట్ల కోసం ప్రతిరోజూ గజ్వేల్‌కు రైతులు వెళ్తుంటారు. డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు పట్టించుకొని మా పల్లెలకు బస్సులు నడిపించాలని కోరుతున్నాం.

– కొమ్మెర పూజిత, దొమ్మాట సర్పంచ్

రైతులకు నిత్యం అవస్థ



గజ్వేల్ నుంచి 25 కిలో మీటర్లు ముబారస్‌పూర్, సూరంపల్లి, దొమ్మాట, గాజులపల్లికి బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రజలకు, రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మా పల్లెకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు కోరుతున్నాం.

– అప్పవారి శ్రీనివాస్, గాజులపల్లి సర్పంచ్

గతంలోనే కోటయ్య పేరుతో ఫిర్యాదులు..

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణ
- విచారణ చేపట్టాలని దేవాదాయ కమిషనర్ ఆదేశాలు
- పట్టించుకోని కొమురవెల్లి ఆలయ ఈవో



ఆలయ రాజగోపురం ఎదుట భక్తులు (ఫైల్)



A copy of the reference cited is sent herewith to the Executive Officer, Sri Mallikarjuna Swamy Devasthanam, Komuravelli(V&M), Siddipet District and it is requested to submit detail report in the matter for taking necessary action.

Sd/- Jyothi R
Additional Commissioner

Superintendent

దేవాదాయ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల పత్రం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయ ఉద్యోగులపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు కె.కోటయ్య పేరుతో గతంలో చాలాసార్లు ఫిర్యాదులు అందాయి. ఆలయంలో 13 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ కింద విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కొండ శ్రీనివాస్ అవినీతి పనులు చేస్తున్నట్లు అక్టోబర్ 10వ తేదీన దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ఆలయ ఆదాయానికి గండికొడుతున్నాడని, ప్రసాదాల తయారీ కేంద్రంలో పని చేసినప్పుడు శనగపిండి, చక్కెర, దాల్డా, వగైరా సామగ్రి అమ్ముకున్నట్లు భక్తులు, గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయం ఆలయ ఉన్నతాధికారులకు తెలిసినా అతడిపై చర్యలు తీసుకోలేదని అక్టోబర్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోటయ్య ఇచ్చిన ఫిర్యాదుపై విచారించి, చర్యలు చేపట్టి సమగ్రమైన నివేదిక అందజేయాలని దేవాదాయ కమిషనర్ ఆలయ ఈవో బాలాజీని నవంబర్ 14న ఆదేశించారు. కానీ ఆలయ ఈవో మాత్రం తనకు ఏమీ తెలియదనట్లు వ్యవహరిస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు, భక్తులు మండిపడుతున్నారు. వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలని ఆలయ ఉన్నతాధికారులను స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయంపై రెండేళ్ల క్రితం శ్రీనివాస్ చేసిన అవినీతి సొమ్మును ఏ విధంగా రికవరీ చేస్తారో చెప్పాలని కోటయ్య సమాచార హక్కు చట్టం ద్వారా ఆలయ ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్‌ను కోరారు. అయినా వారు స్పందించలేదు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

ఆలయంలో పనిచేస్తున్న ఏ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు రాలేదు. వస్తే తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

–ఆలయ ఈవో బాలాజీ

స్వయం ఉపాధితో సమాజంలో గౌరవం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

- మంచి ఆలోచనలు జీవితాన్ని మారుస్తాయి
- సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: స్వయం ఉపాధి ద్వారా ఎవరి కాళ్ల మీద వారు నిలబడితే చుట్టూ ఉన్న ప్రజలు, సమాజం మనల్ని గౌరవిస్తుందని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. సిద్దిపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆర్థిక సాయంతో ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను శుక్రవారం సీపీ అభినందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 35 మంది మహిళలకు 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇప్పించామన్నారు. ఆర్టీవో అధికారితో మాట్లాడి డ్రైవింగ్ లైసెన్స్ త్వరగా ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటు చేసుకోవడానికి, వాహనాల కొనుగోలు చేసుకోవడానికి ముందుకొచ్చే మహిళలకు సంబంధిత బ్యాంకుల నుంచి లోన్‌లు వచ్చే విధంగా యూనియన్ బ్యాంక్ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న తీరును సీపీ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వికాస్, రాజలింగం, నాగరాజు, సజిమ్, అడిషనల్ డీఆర్‌డీఏ రవిందర్, కానిస్టేబుల్ పరంధాములు, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కొని వ్యక్తి మృతి..



మృతుడు జేమ్స్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): లిఫ్టులో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్ లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో నివాసం ఉండే జేమ్స్(38) కొరియర్ బాయ్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అశోక్‌నగర్‌లోని నివాస్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో కొరియర్ రిటర్న్ ఉంటే దానిని తీసుకోవడం కోసం అపార్ట్‌మెంట్‌ని 4వ అంతస్తుకు వెళ్లాడు. కొరియర్ తీసుకొని గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చేందుకు లిఫ్ట్ గేటు తీసుకొని లిఫ్ట్ లేదన్న విషయాన్ని గమనించకుండా అడుగుపెట్టాడు. 4వ అంతస్తు నుంచి లిఫ్ట్ పైన పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లిఫ్ట్ డోర్ సమస్య ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



ములుగు అటవీ కళాశాల

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం (ఎఫ్‌సీఆర్ఐ)లో రెండోవిడత నర్సరీ ఏర్పాటుకు సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రొఫెసర్ ఎం.మమత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీబీటీ–టీఎస్‌సీఎస్‌టీ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగులకు నర్సరీల పెంపకం, వర్మీ కంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకంపై ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా ప్రతినెలా రూ.10 వేలు స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు httpr//www.fcrits.in నుంచి నేరుగా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు edpfcri@gmail.comకి పంపించాలని ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 80743 50866, 84668 71929 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తొలి ప్రజాదర్బార్‌లో వినతులు



హైదరాబాద్‌లో ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసినట్లు చూపుతున్న శ్రీనివాస్‌చారి



సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యను విన్నవిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

తూప్రాన్: కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తూప్రాన్‌కు చెందిన సామాజిక కార్య కర్త, విద్యావేత్త కమ్మరి శ్రీనివాస్‌చారి వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ నియోజకవర్గంలో ఐదేళ్లుగా జరిగిన అవినీతిని, అక్రమాలను, దౌర్జన్యాలు, భూ కబ్జాలను వివరించే గజ్వేల్ ఫైల్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

రాయపోలు(దుబ్బాక): గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాయపోలు మండలం వడ్డేపల్లి సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో ఈ మేరకు ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను వివరించారు. గ్రామంలో దాదాపు రూ. కోటి వరకు వెచ్చించి అభివృద్ధి పనులు చేసినప్పటికీ బిల్లులు రాక చాలా అవస్థలు పడుతున్నామని, దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి ఉందని సీఎంకు విన్నవించారు. దీనిపై స్పందించిన రేవంత్‌రెడ్డి ఈ విషయమై వెంటనే సమీక్షించి వారం రోజుల్లో పెండింగ్ బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- నేడు మధ్యాహ్నం తర్వాత ప్రారంభం
- సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి



సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మీ పథకం విధివిధానాలను తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేసింది. ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ఆర్టీసీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్ని జిల్లాల్లోని డిపో మేనేజర్లు, అధికారులతో శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించి ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం గురించి తీసుకోవాల్సిన విధివిధానాలు, జాగ్రత్తలు, బస్సుల ఏర్పాటు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు తదితర అంశాలపై పలు సూచనలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో శనివారం మధ్యాహ్నం ఈ పథకాన్ని ప్రారంభించిన తర్వాత అన్ని డిపోల్లో ఈ పథకం అమలు అవుతుందని తెలిపారు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో శనివారం ఈ పథకాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా బాలికలు, మహిళలకు ఆర్టీసీ బస్సులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. మొదటి నాలుగు, ఐదు రోజులు ఎలాంటి ఐడీ కార్డు లేకున్నా, మహిళలందరికీ ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఆర్టీసీ ఉన్నతాధికారులు సాఫ్ట్‌వేర్‌ను డెవలప్‌మెంట్ చేస్తున్నారని, అనంతరం రాష్ట్రానికి చెందిన మహిళలు వారు తమ వెంట ఏదైనా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. ట్రాఫిక్ డిమాండ్‌ను బట్టి అదనపు బస్సులను నడుపనున్నట్లు డీఎం తెలిపారు. సిద్దిపేట డిపోలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 109, గజ్వేల్ డిపో పరిధిలో 70 బస్సులు, దుబ్బాక డిపోలో 38 బస్సులు, హుస్నాబాద్ డిపోలో 40 బస్సుల ద్వారా ప్రయాణికులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



శ్రీదిప్తి

సిద్దిపేటజోన్: స్థానిక మెరీడియన్ పాఠశాల విద్యార్థిని శ్రీదిప్తి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హై జంప్ విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించింది. త్వరలో లక్నోలో జరుగనున్న జాతీయ స్థాయిలో పాల్గొననుంది. విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేందర్ అభినందించారు.

ప్రమాదవశాత్తు బస్సు దగ్ధం

మునిపల్లి(అందోల్): ప్రమాదవశాత్తు బస్సు దగ్ధమైన సంఘటన మండలంలోని బుదేరా గ్రామ శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ నుంచి షిరిడి వెళ్తున్న ఎస్‌వీఆర్ ట్రావెల్స్ బస్సు మునిపల్లి మండలం బుదేరా మహిళా డిగ్రీ కళాశాల సమీపంలోకి రాగానే బస్సులో టెక్నికల్ ప్రాబ్లమ్ వచ్చింది. దీంతో గమనించిన డ్రైవర్, క్లీనర్ బస్సు వెనక భాగం చూడగా మంటలు ఉండడంతో బస్సులో ఉన్న 38 మంది ప్రయాణికులను బస్సులో నుంచి దించారు. బస్సు డ్రైవర్ సుభాష్ డిగే ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

- నర్సాపూర్‌లో లారీ, బైక్ ఢీ..
- రామచంద్రాపురంలో బైక్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో శ్రీనివాస్ యాదవ్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు కాగా, ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

నర్సాపూర్ రూరల్: లారీ బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం నర్సాపూర్–తూప్రాన్ రహదారిలోని మల్లన్న గుడి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం గౌడుగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ యాదవ్ బైక్‌పై పని నిమిత్తం నర్సాపూర్‌కు వచ్చాడు. తిరుగి వెళ్తుండగా మల్లన్న గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బైక్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన చెన్నయ్య కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అదే కాలనీలో ఉండే ఆయన బావ నరేంద్ర ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి మియాపూర్‌లో నివాసం ఉండే తన స్నేహితుడు రవితో కలిసి పాల్గొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెన్నయ్య రవిని మియాపూర్‌లో దింపేందుకు బైక్‌పై బయలుదేరారు. అశోక్‌నగర్ సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నయ్యకు తీవ్ర గాయాలు కాగా, రవికి స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి



ఘటనా స్థలంలో హాజీ(ఫైల్)

వర్గల్(గజ్వేల్): వాహనం అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన దివ్యాంగుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన దివ్యాంగుడు సయ్యద్ హాజీ (36) స్కూటీపై సోమవారం వర్గల్ మండలం నాచారంలోని సోదరి ఇంటికొచ్చి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యాడు. గజ్వేల్–తూప్రాన్ రహదారి అనంతగిరిపల్లి శివారులో మలుపు వద్ద స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయమైంది. బంధువులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కాలిపోయిన ఫర్నిచర్, రూ.50 వేల నగదు



ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న ఫైర్ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన జాడు సాయిలు ఇంటిలో షార్ట్‌సర్క్యూట్ వల్ల టీవీ, ఇతర ఫర్నిచర్‌తోపాటు ట్రంకు పెట్టెలో దాచి ఉంచిన రూ.50 వేల నగదు కాలి బూడిదైంది. గ్రామస్తులు పేటలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది శ్రీశైలం, రాజేందర్, రమేశ్, ఇబ్రహీం మంటలను అదుపులోనికి తీసుకొచ్చారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కుంట్ల రాములు, గ్రామస్తులు కోరారు.